ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

3★


గురువారం 18 జనవరి 2024

సమ్మక్క-సారలమ్మ జాతర పనులను ప్రారంభించాలి
- వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి రవీందర్
6లో..

విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి
6లో..

పంచాయతీ ఎన్నికలపై ఉత్కంఠ

- నెలాఖరుతో ముగియనున్న పాలక వర్గాల పదవీకాలం
- పర్సనల్ ఇన్‌చార్జీలా..? ప్రత్యేక అధికారులా..?
- చట్టంలో చేర్పులు, మార్పులు చేసే అవకాశం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామపంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనుంది. దీంతో పంచాయతీ ఎన్నికలపై జిల్లాలో ఉత్కంఠ నెలకొన్నది. నెల రోజుల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబరులోనే ప్రభుత్వం ఏర్పడగా, కుదుట పడేందుకు సమయం తీసుకుంటుండడంతో పంచాయతీ ఎన్నికల నిర్వహణ జోలికి వెళ్లడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పంచాయతీ ఎన్నికలకు కావాల్సిన సిబ్బంది వివరాలు, గ్రామాల వారీగా సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల అమలు, ఇతర హామీలను నెరవేర్చే విషయమై, ఏప్రిల్, మే నెలలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఎన్నికల మెనిఫెస్టోలో రాజీవ్‌గాంధి ప్రవేశపెట్టిన 73, 74 రాజ్యాంగ సవరణ ప్రకారం మూడంచెల స్థానిక సంస్థలకు నిధులు, విధులు, నిర్వహణ పూర్తి స్థాయిలో అప్పగిస్తామని పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ మేరకు 2018లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతనంగా తీసుకవచ్చిన పంచాయతీరాజ్ చట్టంలో చేర్పులు, మార్పులు చేసిన తర్వాతనే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని భావిస్తున్నది. అప్పటివరకు పర్సనల్ ఇన్‌చార్జీ (సర్పంచ్)ల పాలనను తీసుకవస్తారా, ప్రత్యేక అధికారుల పాలనను తీసుకువస్తారా అనే అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

● పార్లమెంట్ ఎన్నికల తర్వాతనే ఎన్నికలు..?

జిల్లాలోని 263 గ్రామ పంచాయతీలకు, 2436 వార్డు స్థానాలకు 2019 జనవరిలో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవులు, వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్లను అమలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, బీసీలకు 27 శాతం, జనరల్‌కు 49.5 శాతం రిజర్వేషన్లను అమలు చేశారు. ఆ మేరకు జిల్లాలో 130 స్థానాలకు జనరల్ కేటగిరీకి కేటాయించగా, ఇందులో మహిళలకు 75 స్థానాలు, బీసీలకు 70 స్థానాలు కేటాయించగా, మహిళలకు 35 స్థానాలు, ఎస్సీలకు 55 స్థానాలు కేటాయించగా, మహిళలకు 28 స్థానాలు, ఎస్టీలకు 8 స్థానాలు, మహిళలకు 4 స్థానాలు కేటాయించారు. జిల్లాలో గతంలో ఉన్న పంచాయతీల్లో కొన్ని పంచాయతీలు కొత్తగా మున్సిపాలిటీగా ఏర్పడ్డ సుల్తానాబాద్‌లో విలీనం చేశారు. అంతర్గాం మండలం లింగాపూర్, కుందనపల్లి, రామగుండం మండలంలోని ఎల్కలపల్లి పంచాయతీ పరిధిలోని 2 వార్డులు, రామగిరి మండలం వెంకట్రావుపల్లి పంచాయతీని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేశారు. కొత్తగా ఏర్పడ్డ పంచాయతీలతో కలిపి మొత్తం 263 పంచాయతీలకు, 2,436 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. విలీన గ్రామాల ప్రజలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో ఆ పంచాయతీలను మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తొలగించారు. గతంలో రిజర్వేషన్లు ప్రతి ఐదేళ్లకోసారి రోటేషన్ పద్ధతిన అమలు చేసేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో తీసుకవచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లను పదేళ్లకు పెంచారు. అంటే గత ఎన్నికల్లో అమలు చేసిన రిజర్వేషన్లనే ఈ ఎన్నికల్లో అమలుచేయాల్సి ఉంటుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను దక్కించుకోవడంతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఒకవేళ రిజర్వేషన్లను మార్చాలంటే చట్టంలో చేర్పులు, మార్పులు తీసుక వచ్చేందుకు అసెంబ్లీ తీర్మానం చేయాల్సి ఉంటుందని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఈనెలాఖరుతో ముగియనుండడంతో ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేయడం లేదు. పంచాయతీరాజ్ చట్ట సవరణ చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తున్నది. బీసీలకు రిజర్వేషన్ల శాతాన్ని 27 నుంచి 34 పెంచాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఒకవేళ బీసీలకు రిజర్వేషన్లు పెంచాల్సి వస్తే మాత్రం కొత్తగా సర్పంచ్, వార్డు స్థానాలకు రిజర్వేషన్లు అమలు చేయనున్నారు. సర్పంచ్‌తో పాటు గ్రామ ఉపసర్పంచ్‌కు ఉన్న చెక్ పవర్‌ను తొలగించే అవకాశాలున్నాయి. చట్టంలో కొన్ని అంశాలను తొలగించవచ్చని అంటున్నారు. స్థానిక వనరులపై పంచాయతీలకే అధికారాన్ని కట్టబెట్టాలనే యోచనలో ఉంది. ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభల నిర్వహణ చేపట్టే అవకాశాలున్నాయి. లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసేందుకు పంచాయతీ రాజ్ చట్టంలో కొన్ని విధివిధానాలను తీసుకరావచ్చనే చర్చ జరుగుతున్నది. పాలక వర్గాల స్థానంలో పర్సనల్ ఇన్‌చార్జీలను నియమించాలా, ప్రత్యేక అధికారుల పాలన తీసుకరావాలా అనే విషయమై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. ఈ విషయమై దావోస్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌కు తిరిగివచ్చిన తర్వాత రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఆ శాఖాధికారులతో సమావేశం నిర్వహించి చర్చించే అవకాశాలున్నాయి.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, జనవరి 17 : మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు ఫిబ్రవరి 6లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మొహమ్మద్ మేరాజ్ మహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల/కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ అయ్యిందని పేర్కొన్నారు. జిల్లాలోని 3 మైనారిటీ పాఠశాలల్లో 5వ తరగతిలో రామగుండం మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మొత్తం 80 సీట్లకు, పెద్దపల్లి/మంథని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలలో మొత్తం 40సీట్లకు, అలాగే రామగుండం/మంథని మైనారిటీ బాలుర/బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ కోర్సులకు, పెద్దపల్లి మైనారిటీ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంఈసీ, సీఈసీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎలాంటి ఫీజు లేకుండానే ఫిబ్రవరి 6లోపు ఆన్‌లైన్‌లో www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు పెద్దపల్లి గర్ల్స్ స్కూల్-7331170848, పెద్దపల్లి గర్ల్స్ కాలేజీ-9603313883, రామగుండం బాలుర స్కూల్-733117084, రామగుండం బాలుర కాలేజీ-9948978628, మంథని గర్ల్స్ స్కూల్-79950 57944, మంథని గర్ల్స్ కాలేజీ-7995057944 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

టీఎన్జీవోస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిటౌన్, జనవరి 17: టీఎన్జీవోస్ జిల్లా క్యాలెండర్‌ను బుధవారం కలెక్టర్ ముజమిల్‌ఖాన్ ఆవిష్కరించారు. సందర్భంగా ముజమిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సంక్షేమం గురించి కృషి చేస్తున్నారని, ప్రభుత్వపథకాలు అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, కార్యదర్శి మేనేని సందీప్‌రావు, సుధీర్, కొమురయ్య, మహేందర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ప్రవీణ్, సురేష్, అంజి, సత్యనారాయణ, అనిత, రాజేందర్, రాజారత్నం, ప్రేమ్, శ్రీనివాస్, స్వప్న, సంజీవరాణి, మణెమ్మ, ఫర్హానా, రాజారత్నం, అరుణ, సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్

కోల్‌సిటీటౌన్, జనవరి 17: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హాయంలో విద్యారంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి సమస్యల్ని పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ కోరారు. బుధవారం గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన రమేష్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు రెండు సంవత్సరాల నుంచి విడుదల చేయకపోవడం వల్ల దాదాపు 8వేల కోట్ల రూపాయాలు బకాయిలు ఉన్నాయన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు కూడా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యాసంస్థలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నరేష్, కళ్యాణ్, సురేష్, శ్రీకాంత్, నందాన్ పాల్గొన్నారు.

వైద్యుడిపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు

మంథని, జనవరి 17: స్థానిక మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ప్రసవం కోసం వచ్చే రోగుల నుంచి మత్తు డాక్టర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని మంథనికి చెందిన బండారి సమ్మయ్య బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకం గా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం తన భార్య డెలివరీ సందర్భంగా డబ్బు అడిగితే తాను ఇవ్వకపోవడంతో ఆపరేషన్‌కోసం మత్తు ఇంజెక్షన్ ఇవ్వడానికి డాక్టర్ మోహన్‌రావు నిరాకరించడన్నారు. తాను డబ్బులు ఇవ్వడతో ఇంజెక్షన్ ఇచ్చారని, తనలాగే నిత్యం పలువురిని డాక్టర్ డబ్బుల కోసం వేధిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి డాక్టర్‌పై చర్య తీసుకోవాలని కోరారు.

చెక్‌డ్యాం కూల్చివేతకు యత్నించిన వారిని శిక్షించాలి

- బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న దాసరి ఉష

పెద్దపల్లి రూరల్, జనవరి 17: మండలంలోని భోజన్నపేట, కొత్తపల్లి, మూలసాల గ్రామాల మధ్య హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం కూల్చివేతకు యత్నించిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష డిమాండ్ చేశారు. బుధవారం చెక్‌డ్యాంను బీఎస్పీ బృందంతో కలిసి దాసరి ఉష పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రధానంగా కొత్తపల్లి, భోజన్నపేట, మూలసాల గ్రామాల ప్రజలకు ఉపయోగకరమైన చెక్‌డ్యాంను బ్లాస్టింగ్ చేయాలకున్న వారిని గుర్తించాల న్నారు. చెక్‌డ్యాం కూల్చేందుకు కాంగ్రెస్ నాయకులే కుట్రపన్నారని ప్రజలు చర్చించుకుంటున్నారని, వారు ఎంతటి వారైనా అరెస్ట్ చేసేదాకా బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధానకార్యదర్శి సాతూరి అనిల్, మల్లారపు రవిందన్, బొంకూరి సురేందర్ సన్ని, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాముల ఎదుట లారీ ఓనర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న పెద్దపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

పెద్దపల్లి రూరల్, జనవరి 17 : గోదాముల నుంచి తరలించే ధాన్యాన్ని మిల్లర్లు స్వంతవాహనాలతో కాకుండా పెద్దపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్‌కు సంబంధించిన వాహనాల ద్వారానే సరఫరా చేయాలని బుధవారం జీఎంఆర్ గోదాముల ఎదుట ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే..పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ జీఎంఆర్ గోదాముల నుంచి నిల్వచేసిన వరిధాన్యంను సుల్తానాబాద్ మండలానికి చెందిన రైస్ మిల్లర్లు స్వంత వాహనాలతో తరలిస్తుండగా పెద్దపల్లి లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అడ్డుకొని ఆందోళన చేపట్టారు. గోదాముల నుంచి ఏ సరుకులు సరఫరా అయినా అసోసియేషన్ వారిని సంప్రదించాలని అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా మిల్లర్లు మాట్లాడుతూ ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ రైస్‌ను అందించేందుకు ప్రతి రైస్‌మిల్‌కు స్వంత వాహనాలు ఉన్నాయని, వాటి ద్వా రానే ధాన్యాన్ని తరలిస్తున్నామని పేర్కొన్నారు. సంఘటన స్థలానికి బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేష్ చేరుకొని ఆందోళనను విరమింపజేశారు సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించడంతో ఇరువర్గాలు కలిసేందుకు వెళ్లి నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కార్మిక, కర్షక సదస్సును జయప్రదం చేయండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు

మంథని, జనవరి 17: జిల్లా కేంద్రంలో మూడు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించే కార్మిక, కర్షక సదస్సుకు రైతులు హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు కోరారు. మంథనిలో బుధవారం జరిగిన సీఐటీయూ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మె చేశామన్నారు. సమ్మెపై తమిళనాడు ప్రభుత్వం క్రూరంగా వ్యవహరించి పది మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నదని విమర్శించారు. ఈ సమ్మె పోరాటస్ఫూర్తిగా ప్రతిసంవత్సరం జనవరి 19న కార్మిక, కర్షక దినంగా పాటించాలని సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రానపల్లి తిరుపతి, వ్యవసాయ కార్మిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద రాజేందర్, బూడిద గణేష్, నాయకులు బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో 'జెమ్' వర్క్‌షాప్ ప్రారంభం

- ప్రభుత్వ పాఠశాలల బాలికలకు ప్రత్యేక శిక్షణ - మూడు మండలాల నుంచి 54 మంది విద్యార్థినులు..



జెమ్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులు

జ్యోతినగర్, జనవరి 17 : ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో 5 రోజులపాటు నిర్వహిస్తున్న బాలికా సాధికారత మిషన్(జెమ్) వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ఐదు రోజులపాటు కొనసాగే ఈ వర్క్‌షాప్‌ను ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్ ఇన్‌చార్జి) విజయ్‌కుమార్ సిక్దర్ ప్రారంభించారు. ఎన్టీపీసీ ప్రభావిత ప్రాంతంలోని మూడు మండలాలకు చెందిన 54మంది విద్యార్థినులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొంటున్నారు. ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థినులకు చదువుకు సంబంధించిన అంశాలతోపాటు నైపుణ్యాభివృద్ధి, కళలు, నృత్యం, చిత్రలేఖనం, క్రీడలు తదితర విషయాల్లో ప్రత్యేక శిక్షణనిస్తారు. బాలికల్లో సాధికారత సాధించడమే లక్ష్యంగా ప్రతి ఏటా వేసవి కాలంలో నెల రోజులపాటు జెమ్ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అయితే జనవరిలోనే జెమ్‌కు సంబంధించి 5 రోజుల వర్క్‌షాప్‌ను ముందస్తుగా నిర్వహిస్తున్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొనే విద్యార్థినులకు ఉచిత వసతి, భోజనం, ఇతర ఉపకరణాలను ఎన్టీపీసీ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. మొదటి రోజు శిబిరంలో పాల్గొంటున్న ఒక బాలిక పుట్టిన రోజును ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు జరుపుకున్నారు. బాలికలను ప్రోత్సహించడం, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు జెమ్ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని ఏజీఎం సిక్దర్ అన్నారు. ఎన్టీపీసీ కల్పిస్తున్న ఈ శిక్షణా శిబిరాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శామ్యూల్ ప్రశాంత్, దీప్తి మహిళా సమితి సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు సలహాలివ్వాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 17: పంటల సాగుపై ప్రతి దశలో రైతుకు అండగా ఉంటూ అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దపల్లి మున్సిపాలిటీ శివారులోని చందపల్లిలో వరి నాట్లు వేస్తున్న రైతుల పొలాలను కలెక్టర్ పరిశీలించారు. సాగు పద్ధతులను, పంటలో వచ్చే లాభం, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రైతులతో కలిసి పొలంలో వరి నాట్లు వేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆది రెడ్డి, పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి అలివేణి, క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, రైతులు పాల్గొన్నారు.

డీటీఎఫ్ డైరీని ఆవిష్కరించిన కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, జనవరి 17: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్-2024 డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న పలు సమస్యలు, పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాల గురించి ఆరా తీసి చర్చించారు. కార్యక్రమంపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మధుమోహన్, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామ్‌కిషన్‌రావు, సంతోష్, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కిరణ్, రాజమౌళి, ప్రసాద్, మల్లేశ్వరరావు, ప్రతాప్‌చారి, అంతయ్య, సదానందం, సతీష్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జనవరి 17: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం క్యాలెండరును బుధవారం కలక్టరేట్‌లోని తన కార్యాలయంలో అదనపు కలెక్టర్ అరుణశ్రీ ఆవిష్కరించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సేవాభావం అలవర్చుకుని సమాజ సేవలో పద్మశాలి ఉద్యోగులు ముందుండాలని పిలుపునిచ్చారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాముల దత్తాద్రి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల కోటేశం, అసోసియేట్ అధ్యక్షులు గౌడ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మహేశుని వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

మంథని, జనవరి 17: మంథని నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంథని ఆర్డీవో కార్యాలయంలో ఈఆర్‌వో హనుమానాయక్ బుధవా రం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగే వారసమీక్ష భాగంగా ఆర్డీవో సమావేశమయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 10 మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

రామగుండంలో పడకేసిన పారిశుధ్యం

- మరమ్మతులు లేక మూలనపడ్డ స్వచ్ఛ ఆటోలు - ఇంటింటా చెత్త సేకరణకు ఆటంకాలు..

- షెడ్‌లకే పరిమితమవుతున్న ట్రాక్టర్లు - శిథిలమైన కంపాక్టర్ బిన్లు - రోడ్లపై పేరుకుపోతున్న చెత్త



మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆటో ట్రాలీలు



కార్పొరేషన్ ఆవరణలో పడవేసి ఉన్న బిన్‌లు

కోల్‌సిటీ, జనవరి 17: రామగుండం నగరపాలక సంస్థలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఏ వీధిలోకి వెళ్లినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. కోట్ల రూపాయలు పెట్టి వాహనాలు కొనుగోలు చేసినా నిర్వహణ లేక మరమ్మతులతో మూలన పడ్డాయి. ఇంటింటా చెత్త సేకరణకు కొనుగోలు చేసిన స్వచ్ఛ ఆటోలు నెలలకు నెలలుగా మరమ్మతులు లేకపోవడంతో షోరూమ్‌లు, షెడ్లలో పడేసి ఉంటున్నాయి. ఇంటింటా చెత్త సేకరణకు తీవ్ర ఆటంకం ఏర్పడింది.

నెరవేరని లక్ష్యం..

రామగుండం నగరపాలక సంస్థ 93 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది. సంస్థలో సుమారు 60వేలకు పైగా నివాసాలున్నాయి. ఇందులో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ క్వార్టర్లు మినహా మిగతా ప్రాంతాల్లో నే రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య సేవలను అందిస్తోంది. నగరపాలక సంస్థ 50డివిజన్లకు సుమారు 35డివిజన్లలోనే పారిశుధ్య సేవలు అందిస్తుంది. కార్పొరేషన్ రోజుకు 130టన్నుల చెత్త తరలిస్తున్నట్టు అంచనా వేస్తున్నారు. 13ట్రాక్టర్లు, 50స్వచ్ఛ ఆటోలు, రెండు కాంపాక్టర్లు చెత్త సేకరణకు వినియోగిస్తున్నారు. మూడేళ్ల క్రితం 50 స్వచ్ఛ ఆటోలను 12వ ఆర్థిక సంఘం, డీఎంఎఫ్‌టీ నిధులతో కొనుగోలు చేశారు. ప్రస్తుతం 12ఆటోలు మూలన పడ్డాయి. మూడు ఆటోలు అయితే సుమా రు ఏడాది కాలంగా షెడ్లలోనే ఉన్నాయి. మరో మూడు ఆటో ట్రాలీలు షోరూమ్‌లో రిపేర్లు పూర్తయి బిల్లులు చెల్లించలేక ఆగి ఉన్నాయి. దీంతో డివిజన్‌కు ఒక ఆటో చొప్పున కేటాయించినా ఆ లక్ష్యం నెరవేరడం లేదు. రెండు కాంపాక్టర్లు ఉన్నా బిన్‌లు శిథిలమయ్యాయి. దీంతో ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతుంది. ట్రాక్టర్లతోనే చెత్తను ఎత్తాల్సిన దుస్థితి ఏర్పడింది. 14ట్రాక్టర్లలో నాలుగైదు ట్రాక్టర్లు రిపేర్లతో మూలన పడ్డాయి. ట్రాక్టర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ కాల పరిమితి కూడా పూర్తయ్యింది. ఆటో ట్రాలీలు, ట్రాక్టర్లు పూర్తి స్థాయిలో పని చేసే పరిస్థితి లేదు. కార్పొరేషన్‌లో ఎట్టి పరిస్థితుల్లో ఇంటింటా చెత్త సేకరణ చేయాలని కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాలు ఇస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి.

వాహనాల నిర్వహణపై పట్టింపేది..

రామగుండం నగరపాలక సంస్థలో స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు, కాంపాక్టర్లు, జెట్టింగ్ మిషన్లు, స్వీపింగ్ మిషన్లు, జెట్టింగ్ కం సక్షెన్ మిషన్ తదితర యంత్రాలున్నాయి. వాటి నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేశారు. ఆగ్రోస్ పేర కొనుగోలు చేసినా వాటికి వారంటీ పరీయడ్ లేదు. చిన్న చిన్న రిపేర్లు వస్తే కూడా చేయించలేక మూలన వేసున్నారు. దీంతో పారిశుధ్య సేవలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఎన్ని వాహనాలు నడుస్తున్నాయి, ఎక్కడ తిరుగుతున్నాయి, ఎంత చెత్త సేకరణ జరుగుతుంది, ఎవరు పని చేస్తున్నారు అని అజమాయిషీ కూడా లేని పరిస్థితి ఉంది.

ప్రాణభయంలో కార్మికులు..

రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య వాహనాలకు ఇన్సూరెన్సు లు లేవు. ట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ గడువే పూర్తయ్యింది. ఫిట్ మెంట్లు కూడా లేవు. స్వచ్ఛ ఆటోలకు ఇన్సూరెన్స్‌లు లేవు. గతంలో యైటింక్లయిన్‌కాలనీలో డంపర్ పేసర్‌ను రైలు ఢీకొట్టడంతో ఇన్సూరెన్స్ లేక క్లైమ్ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఆ వాహనం మూలన పడింది. రిపేర్ల కోసం మంచిర్యాల షోరూమ్‌లో వేసి ఏళ్లు గడుస్తున్నాయి. బస్టాండ్ సమీపంలో పారిశుధ్య ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టగా కార్మికుడు ప్రాణాలతో బయట పడ్డాడు. దానికి ఇన్సూరెన్స్ లేదు. నాలుగు రోజుల క్రితం హోటళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న ఆటో ట్రాలీని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీ పూర్తిగా దెబ్బతినగా డ్రైవర్ రమేష్ ప్రాణాలతో బయట పడ్డాడు. ఈ ట్రాలీకి ఇన్సూరెన్స్ లేదు. ఇప్పటికే కార్మికులు ప్రమాదాలకు గురై గాయప డితే పట్టించుకునేవారు లేరు. అలాగే ఇన్సూరెన్స్‌లు లేకపోవడంతో అరచేతుల్లో ప్రాణాలు పెట్టుకుని పని చేస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలో పరిష్కారం

- పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జనవరి 17: ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికారప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీఆర్‌టీయూటీ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను కొత్తగా తయారు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57/4, 57/5 మెమోను అమలు చేయాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఎస్‌జీటీ, ఎస్‌ఏలకు వేతన వ్యత్యాసాలను తగ్గించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ ఉపాధ్యక్షులు కేతిరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మక్కపేట శివారులో చిరుత పులుల సంచారం

ఇబ్రహీంపట్నం, జనవరి 18: మండలంలోని అమ్మక్కపేట గ్రామ శివారులోని వ్యవసాయ భూములలో, చెరుకు తోటలలో చిరుత పులుల సంచారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ ప్రాంతం వెంబడి, వ్యవసాయ తోటలలో రెండు రోజుల నుంచి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఓ రైతుకు చెందిన తోటల నుంచి పులులు వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించారు. ఎఫ్‌ఆర్‌ఓ షౌకత్ అలీ అక్కడకు చేరుకుని చిరుత పులి పగ్ మార్కును(అడుగులు) పరిశీలించారు. అటవీ ప్రాంతంలో, పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు షౌకత్ అలీ తెలిపారు. అనుమానిత ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత పది రోజుల క్రితమే పక్కన ఉన్న సత్యక్కపల్లె గ్రామంలో సంచరించిన పులి అమ్మక్కపేట గ్రామ శివారుకు వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 39మంది రైతులు 422 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించారు.

ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన వృద్ధుడు గూడ రాజిరెడ్డి(90) కల్వర్టు పైనుంచి పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుపై కూర్చున్న రాజిరెడ్డి ప్రమాదవశాత్తు కింద పడడంతో గాయాలతో చనిపోయాడు. మృతుడి కొడుకు అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తీకు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్న సాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్తూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందదని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్లు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.





రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే నెంబర్ 66లో 2009-10 పహాణి ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పొరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాల తోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఆర్డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బామ్మర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబుచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్ల పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసు కునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

అదనంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆందోళన

మంథని, జనవరి 17: స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంకులో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజలు బుధవారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ.. మంథనిలో కేవలం మూడు ఆధార్ కేంద్రాలు ఉండడం వల్ల సాంకేతిక సమస్య వల్ల ఆధార్ లింక్ కాకపోవడంతో ప్రజలు రోజుల తరబడి ఆధార్ కేంద్రం చుట్టూ పడిగాపులు కాస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలలో ఆధార్ లింక్ తప్పనిసరి కావడంతో లింక్ కాకపోవడం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంథనిలో అదనంగా ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మూడు ఆధార్ కేంద్రాల్లో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని, మొదటిగా స్కూల్ ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థులకు ఆధార్ సమస్యలను పరిష్కరించాలని, కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ త్రివేణి ధర్నా వద్దకు వచ్చి ఆధార్ లింక్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

20న దుకాణాలకు వేలంపాట

అంతర్గాం, జనవరి 17: అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీరంలో వచ్చేనెల 21 నుంచి 24వరకు జరుగనున్న శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతరలో దుకాణాల ఏర్పాటుకు ఈనెల 20న గోలివాడ గ్రామంలోని శ్రీకోదండ రామాయలంలో వేలంపాట నిర్వహించనున్నట్లు జాతర కమిటీ చైర్మన్ పెంద్రు హనుమాన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. కొబ్బరికాయలు, బెల్లంపల్లి, తలనీలాలు, తల్లి ఆరాధాన, తైబజార్‌ల వేలానికి రూ.50 వేలు, ప్యాలాలు, పుట్నాలు, లడ్డు ప్రసాదం, శీతల పానియాల వేలానికి రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. కమిటీ సభ్యులు కోల రాంమూర్తిగౌడ్, ఆవుల గోపాల్‌యాదవ్, బాలసాని సత్తయ్యగౌడ్, పల్లికొండ తిరుపతి, దొంతుల గంగయ్య, దర్ని నరేం దర్ పాల్గొన్నారు.

ఒడిశా కార్మికురాలి మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, జనవరి 17 : సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని మార్కండేయకాలనీ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువలో ఒడిశా కార్మికురాలు భారతి(20) మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన భోజరాజ్-భారతి దంపతులు కుటుంబంతో సహా సుల్తానాబాద్ ఇటుక బట్టీలలో పనిచేస్తున్నారు. సోమవారం భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో మనస్థాపానికి చెందిన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె జాడ కోసం భర్త గాలించినా తెలియకపోవడంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఇదే నేపథ్యంలో మహిళ కార్మికురాలి మృతదేహం మార్కండేయ కాలనీ వద్ద గల ఎస్సారెస్పీ కాలువలో లభ్యం కావడంతో పోలీసులు ఈ సమాచారం భర్త భోజరాజ్‌కు అందజేశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజేందర్ తెలిపారు.

పాత కక్షలతో దంపతులపై దాడి

ముత్తారం, జనవరి 17: పాత కక్షలు దృష్టిలో ఉంచుకొని దంపతులపై దాడి చేసిన సంఘటన ముత్తారం మండలంలోని లక్కారం గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలు దోరి మంజుల ఈ సంఘటనపై ముత్తారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. లక్కారం గ్రామానికి తమ సమీప బంధువు వీరగోని రాజేశం, అతడి కుటుంబ సభ్యులు తనతో పాటు తన భర్తపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు పోలీస్‌స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికుడిని గెలిపించాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 17: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికుడినైన తనను గెలిపించాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ నతానియేలు ప్రజలను కోరారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు పెద్దపల్లి పార్లమెంట్ నుంచి నియోజక వర్గానికి సంబంధం లేనివారు ఎన్నికయ్యారన్నారు. సమస్యల పరిష్కారంలో వలస నాయకులు పూర్తిస్థాయిలో విఫలమయ్యారన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని తన అభ్యర్థిత్వాన్ని బలపరచి గెలిపించాలని నతానియేలు ప్రజలను కోరారు. సమావేశంలో బండ్ సొసైటీ అధ్యక్షులు, పల్లెల వీరస్వామి, దొడ్డి బాపు, జంగ మహేందర్ రెడ్డి, కర్రె మహేందర్ రెడ్డి, యాలాద్రి సపోజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

ధర్మారం, జనవరి 17: మండలంలోని దొంగతుర్తి గ్రామ శివారులోగల 380 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై బుధవారం కలెక్టర్‌కు ఎంపీటీసీ సభ్యుడు దాడి సదయ్య ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులోని ప్రభుత్వభూమిలో నర్సరీ, పల్లెప్రకృతి, డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని సర్పంచ్ గ్రామపంచాయతీ లెటర్ హెడ్‌పై అదే గ్రామానికి చెందిన వేమునూరి లింగయ్యకు దారాదత్తం చేయడానికి రాసి ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ధర్మారం,జనవరి17: మల్లాపూర్‌లోగల సాంఘీక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో 2024-25విద్యా సంవత్సరానికి 5వతరగతిలో ప్రవేశాలకు ఈనెల 20లోగ దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ గిరిజ ఒక ప్రకటనలో తెలిపారు. 4వతరగతి పూర్తి చేసిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఇందులో చేరెందుకు అర్హులని ఆమె పేర్కోన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

31 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్,జనవరి 17 : ఎస్‌యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎమ్మెస్ డబ్ల్యు విద్యార్థులకు ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 8 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాలకు వేలం..

పెద్దపల్లిటౌన్, జనవరి 17: వివిధ నేరాలలో పట్టుబడిన 5 వాహనాలకు ఈ నెల 18న గురువారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం వేసే వాహనాల్లో హోండాషైన్, బజాజ్‌పల్సర్, గ్లామర్, సిబిట్విస్ట్, స్ప్లెండర్ ఉన్నట్లు, అన్ని వాహనాలు రోడ్డు వర్క్ కండిషన్లో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే డబ్బులు డ్రా..

సుల్తానాబాద్, జనవరి 17 : తన ప్రమేయం లేకుండానే ఎస్‌బీఐ బ్యాంకులోని తన ఖాతా నుంచి పది రోజులు రోజుకు పదివేల చొప్పున లక్ష రూపాయలను డ్రా అయ్యాయని సుల్తానాబాద్ పట్టణానికి చెందిన బండ రాజు వాపోయాడు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న తాను బుధవారం సుల్తానాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు. అలాగే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించానన్నాడు. బ్యాంక్ అధికారులు, పోలీసులు తగిన చర్యలు తీసుకొని పోయిన తన డబ్బును తిరిగి ఇప్పించాలని బాధితుడు కోరాడు.

సమ్మక్క-సారలమ్మ జాతర పనులను ప్రారంభించాలి

- సమయం దగ్గర పడుతున్నా పట్టించుకోని అధికారులు - వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్

కోల్‌సిటీ, జనవరి 17: గోదావరిఖని గోదావరి వంతెన వద్ద ఉన్న సమ్మక్క-సారలమ్మ జాతర పనులను ఇప్పటివరకు అధికార యంత్రాంగం పనులను ప్రారంభించలేదని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి అయోధ్య రవీందర్, ఉత్సవ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బుధవారం గోదావరి ఒడ్డున జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంతాన్ని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, జాతర కమిటీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరకు కేవలం నెల రోజులే సమయం ఉన్నప్పటికీ అధికారులు ఇప్పటికీ పనులను నిర్వహించడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతర రెండు మూడు రోజులు ఉన్నదనగా పనులు చేయడం కోసం ఆర్భాటం చేస్తున్నారని, పారిశ్రామిక ప్రాంతంలోనే అతిపెద్ద జాతర అయిన గోదావరిఖని సమ్మక్క-సాలరమ్మ జాతరకు 5 లక్షల మంది తరలివస్తారని, వారికి కనీస ఏర్పాట్లు చేయకుండా ప్రతిసారి భక్తులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటూ అధికారులు నాణ్యత లేని పనులు చేస్తున్నారని, సింగరేణి, ఎన్‌టీపీసీ లాంటి సంస్థల నుంచి పనులు చేయించుకునే అధికారం ఉన్నప్పటికీ కమీషన్ల కోసం చేయడం లేదని ఆరోపించారు. దేవాదయ, ధర్మాదయ శాఖ నుంచి వచ్చే డబ్బులను తమ ఖజానాకు మార్చుకుని కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, జాతర ప్రాంగణంలో మున్సిపల్ చెత్తను వేయడంవల్ల ఆ ప్రాంతమంతా మురికికూపంగా మారిందన్నారు. గోదావరిలో చెత్త పేరుకుపోయిందని, వాటిని తొలగించాలని, గోదావరి ఒడ్డున గల పుష్కర ఘాట్‌ను వంతెన వరకు నిర్మించాలని, రాజీవ్ రహదారి నుంచి జాతరకు వచ్చే దారిని సీసీరోడ్డుతో నిర్మించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మహిళలకు స్నానాలగదులు, బట్టలు మార్చుకోవడానికి పర్మినెంట్ రూమ్‌లను ఏర్పాటుచేయాలని, ఏ శాఖకు సంబంధించిన పనులను ఆ శాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. లేకపోతే వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడగోని రవీందర్, ఇసంపల్లి వెంకటన్న, వెంకటస్వామి, లింగన్న, అడిగొప్పుల రాజు, మునిగాల సంపత్, అజయ్, జలేందర్, సుధీర్, బాలు, మోమన్‌రెడ్డి, చక్రపాణి, మోడెం సురేందర్, లడ్డు పాల్గొన్నారు.



గోదావరి ఒడ్డును పరిశీలిస్తున్న నాయకులు

మల్లికార్జునుడి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, జనవరి 17 : మండలంలోని లాలపల్లి గ్రామంలో ఈనెల 14నుంచి 17వరకు శ్రీమల్లికార్జునుడి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. బుధవారం చివరిరోజు నాగవెల్లి పట్నాలకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీమల్లికార్జునుడి ఆశీస్సులు ప్రజలకు మెండుగా ఉండి పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే శ్రీమల్లికార్జునుని బ్రహ్మోత్సవాలు మూడురోజుల పాటు నిర్వహిస్తుంటారన్నారు. కులమతాలకు అతీతంగా జరుపుకునే ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వరాజేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు గుర్రం మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పెద్ది రాజేశం, బద్దం మల్లారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, కల్లె శ్రీనివాస్‌రెడ్డి, కొప్పర తిరుమల్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

మండల కేంద్రానికి చెందిన ఆర్టిస్ట్ చెల్లోజ శ్రీనివాస్‌బాబు ఎమ్మెల్యే విజయరమణారావును బుధవారం సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కొప్పర తిరుమల్‌రెడ్డి, కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, అమ్ముల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

'సహకార క్రాంతి' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంథని, జనవరి 17: కేడీసీసీ బ్యాంక్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన సహకార క్రాంతి డిపాజిట్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని జీఎం ఉషశ్రీ కోరారు. బుధవారం మేనేజర్ దుమ్మని లక్ష్మణ్, డీఈ దీలిప్, బ్యాంక్ సిబ్బందితో కలిసి ఆమె మంథని పట్టణంలో డిపాజిట్లను సేకరించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో అత్యుత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు పొంది, ఏడేళ్లుగా అవార్డులను అందుకుంటూ వంద సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ వినియోగదారుల మన్ననలు పొందుతున్న బ్యాంకు సహకార బ్యాంకు అన్నారు. అన్ని వాణిజ్య బ్యాంకులకంటే ఎక్కువగా వడ్డీ రేటు అందిస్తుండటంతో కేడీసీసీ బ్యాంక్ ప్రవేశపెట్టిన సహకార క్రాంతి డిపాజిట్ పథకానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. సహకార క్రాంతి డిపాజిట్లపై 546రోజులకు 7.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ చెల్లిస్తామని ఆమె వివరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న జీఎం ఉషశ్రీ

కూలిపోయిన వంతెనను పునర్నిర్మించాలి

సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు డిమాండ్



కూలిపోయిన వంతెనను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 17: రామగుండం కార్పొరేషన్ పరిధిలోని జనగామలో రెండేళ్ల క్రితం గోదావరి వరదలతో కూలిపోయిన వంతెనను పునః నిర్మాణం చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజు సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కూలిపోయిన వంతెనను సీపీఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల కారణంగా కూలిపోయిన వంతెనను అప్పటి ఎమ్మెల్యే చందర్, ఎంపీ వెంకటేష్‌నేత సందర్శించి వంతెన పునర్నిర్మాణం చేపడుతామని చెప్పి ఏడాది అయినా ఇప్పటివరకు హామీని నెరవేర్చలేదన్నారు. వంతెనకు నిధులు మంజూరు చేసినప్పటికీ ఎందుకు నిర్మాణం చేపట్టడం లేదని వారు మున్సిపల్, సింగరేణి అధికారులను ప్రశ్నించారు. పొలాలకు వెళ్లే రైతులు, స్మశానానికి వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వంతెనను నిర్మించేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు తొడుపునూరి రమేష్, తాళ్లపల్లి మల్లయ్య, గుంపుల కుమారస్వామి, జైపాల్‌రెడ్డి, కల్వల జగన్ ఉన్నారు.

విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, జనవరి 17: విద్యుత్ సమస్యలు వెంటవెంట పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లాలో ఉన్న విద్యుత్తు ఇంజనీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ముందు జాగ్రత్తల తీసుకోవాలని, 33 కేవీ, 11కేవీ ఫీడర్లలో అంతరాయాలు తగ్గించాలని, వినియోగదారులతో సత్సంబంధాలను మెరుగుపరుచుకోవాలని, ఏ సమస్యమైనా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజనీర్లు, స్టాఫ్ అని బేదాభిప్రాయాలు లేకుండా అందరం కలిసికట్టుగా కష్టపడి పనిచేసి సంస్థను అభివృద్ధి పథంలోకి వచ్చేటట్లు కృషి చేయాలన్నారు. ఇంజనీర్లు, స్టాఫ్ అందరు వినియోగదారులకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్టీ వినియోగదారులు తమ కుల ధ్రువీకరణ ఇవ్వవలసినవారు 515 మంది మిగిలారని, వారు తమ దగ్గర ఉన్న ఏఈ ఆపరేషన్ కార్యాలయంలో అందచేసి, ప్రభుత్వం అందించే 200యూనిట్లు రాయితీలను పొందాలని సీఅండ్ఎండీ కోరారు. ప్రస్తుత ప్రభుత్వం అందచేయబోయే గృహజ్యోతి కింద వినియోగదారునికి 200యూనిట్ల రాయితీ పథకానికి కరంటు కనెక్షన్ లేని వారు వెంటనే మీసేవ కేంద్రంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. బిల్ కట్టక ఆగిపోయిన సర్వీసులను కొంత చెల్లించినచో సర్వీస్ కనెక్షన్ ఇవ్వాలన్నారు. వినియోగదారులు అందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ బావుల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండకూడదని సూచించారు.

అలాగే కొత్తగా వ్యవసాయ కనెక్షన్ కావల్సినవారు తమ అప్లికేషన్లను రిజిష్టర్ చేసుకోవాలని, విద్యుత సంస్థ త్వరితగతిన ఇవ్వడానికి కృషి చేస్తుందని తెలియజేశారు. వినియోగదారులు తాము విద్యుత్ సంస్థకు చెల్లించవలసిన బకాయిలను త్వరితగతిన చెల్లించి, సంస్థ పురోభివృద్ధికి తోడ్పడాలని వరుణ్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



రిటైర్డ్ కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు..

గోదావరిఖని, జనవరి 17: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. 2023-24 వార్షిక సంవత్సర లాభాలవాటా మొత్తాన్ని ఈనెల 19న చెల్లించనున్నది. 21న పీఎల్ఆర్ బోనస్, ఫిబ్రవరి 6న ఏరియర్స్‌ను ఇటీవల దిగిపోయిన కార్మికులకు చెల్లించనున్నది.

పారదర్శకంగా మెడికల్ బోర్డు : సీఎండీ బలరాం

గోదావరిఖని, జనవరి 17: అత్యంత పారదర్శకంగా మెడికల్ బోర్డు నిర్వహిస్తున్నామని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం పేర్కొన్నారు. ఈమేరకు ఆయన బుధవారం మెడికల్ బోర్డుపై ప్రకటన జారీ చేశారు. అనారోగ్య కారణాలతో విధి నిర్వహణ చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం సంస్థ నిర్వహించే మెడికల్ బోర్డును అత్యంత పారదర్శకంగా, అక్రమాలకు తావులేకుండా బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్‌ఫిట్ పేరిట జరుగుతున్న మోసాల పట్ల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని బలరాం సూచించారు. డబ్బులు పెడితే అన్‌ఫిట్ చేయిస్తామని ఎవరైనా ప్రలోభపెడితే నమ్మవద్దని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులందరిని సింగరేణి నిర్వహించే మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి అన్‌ఫిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. అన్‌ఫిట్ అయిన ఉద్యోగి స్థానంలో కారుణ్య నియామకల కింద వారి వారసులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు సీఎండీ తెలిపారు. మెడికల్ అన్‌ఫిట్ చేయిస్తామని డబ్బులు అడిగే దళారుల వివరాలకు సింగరేణి విజిలెన్స్ విభాగానికి అందజేయాలని సీఎండీ ఉద్యోగులకు సూచించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, క్రిమినల్ కేసులు నమోదు అయ్యేలా చర్యలు ఉంటాయని తెలిపారు. కార్మికులను వంచిస్తున్న మోసగాళ్ళపై నిఘా పెట్టాల్సిందిగా ఇప్పటికే పోలీస్ శాఖను అప్రమత్తం చేయడం జరిగిందని, పూర్తి పారదర్శకంగా మెడికల్ బోర్డు నిర్వహించనున్నట్లు సీఎండీ బలరాం పేర్కొన్నారు. అన్‌ఫిట్ అయి కారుణ్య నియామకాల ద్వారా 16 వేల మంది వారసులకు ఉద్యోగ అవకాశాలు దక్కినట్లు సీఎండీ బలరాం ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్అండ్‌పీసీ పిట్ కమిటీ నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 17: ఏఐటీయూసీ ఆర్జీ-2 ఏరియా ఎస్అండ్‌పీసీ పిట్ కమిటీ నియామకం జరిగింది. పిట్ సెక్రెటరీగా ఏ నర్సయ్య, ఏ షిఫ్టు ఇంచార్జిగా శ్రీనివాస్, బీ షిఫ్టు ఇంచార్జిగా రవికుమార్, సీ షిఫ్టు ఇంచార్జిగా రాజ్‌కుమార్ నియమితులయ్యారు. సలహాదారుడిగా కొంరయ్య, కమిటీ సభ్యులుగా డీ సురేష్, కనకయ్య, రాములును బ్రాంచి కమిటీ నియమించింది. కాగా బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్ నూతన కమిటీని ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ కు పరిచయం చేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచి సహాయ కార్యదర్శి శ్యాంసన్, ఓసీపీ-3 పిట్ సెక్రెటరీ ఎజ్జ రాజయ్య పాల్గొన్నారు.



ఎస్ఎస్‌వోకు కమిటీని పరిచయం చేస్తున్న రవీందర్

ఇటుక బట్టీలపై విచారణ

పెద్దపల్లి రూరల్, జనవరి 17: జిల్లాలో పలు ఇటుక బట్టీలను అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని లోకాయుక్తలో ఫిర్యాదు చేయడంతో బుధవారం పంచాయతీరాజ్ శాఖ, రెవెన్యూ, మైనింగ్, పొల్యూషన్ శాఖ అధికారులు మండలంలోని గౌరెడ్డిపేట గ్రామంలోని పలు ఇటుక బట్టీలను పరిశీలించి విచారణ చేపట్టారు. ఇటుక బట్టీల నిర్వహణ, అనుమతులు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, భూముల వివరాలు తదితర వాటిపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

పెద్దపల్లి రూరల్, జనవరి 17: పెద్దపల్లి మండలం కాపులపల్లి గ్రామానికి చెందిన పిట్టల సుగుణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం దేవసాని శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. వారి వెంట మాదరవేని సతీష్, షేక్ గౌస్, అనిల్, పిట్టల రాకేష్, సమీర్, అరవింద్, రాజయ్య, స్వామిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అరుణ

ఓదెల, జనవరి 17: మండల కేంద్రంలో బుధవారం భూసారం కోసం నవధాన్యాల సాగుపై రైతులకు బిసి ఐఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో అరుణ అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన రైతు బోడకుంట శంకర్ భూమిలో నవధాన్యాల సాగును ప్రారంభించినట్లు తెలిపారు. భూమిలో పత్తి పంటను తొలగించిన తర్వాత బీసీ ఐఎఫ్ఎఫ్ ఆధ్వర్యంలో నవధాన్యాల సాగు చేయించడం జరిగిందని అరుణ తెలిపారు. దీంతో భూమికి కావలసిన అనేక రకాల సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూసారం అధికంగా ఉంటుందని రైతు శంకర్ తెలిపారు. భూసారం పెరగడం వల్ల అధిక దిగుబడులు రావడానికి నవధాన్యాలు దోహదపడతాయని తెలిపారు. పంటకు ఎక్కువ మందులు అవసరం ఉండవని, రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందని తెలిపారు. దీంతో కలుషితం లేని వాతావరణం, భూసారంతో వ్యవసాయ భూములు సాగవుతాయని అన్నారు. నవధాన్యాల సాగు పద్ధతిని రైతులు ఆసక్తిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

సుల్తానాబాద్, జనవరి 17: సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌ల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈనెల 31తో సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా మండల పరిషత్‌లో ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సర్పంచ్‌ల సేవలను పొగుడుతూ వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శశికళ, వైస్ ఎంపీపీ కోట స్వప్న రాంరెడ్డి, ఎంపీటీసీ లు, పంచాయితి కార్యదర్శులు , మండల అధికారులు పాల్గొన్నారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన తర్వాత సర్పంచులపై ప్రశంసలా'

పెద్దపల్లి (ఆంధ్రజ్యోతి), మంథని, జనవరి 17 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత సర్పంచులపై మాజీ మంత్రి కేటీఆర్ ప్రశంసలు కురిపించడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర, రాష్ట్ర అవార్డు గ్రహీత నాగారం సర్పంచ్ బూడిద మల్లేష్ ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పాలనలో సకాలంలో బిల్లులు రాక కార్యాలయాల చుట్టూ తిరిగారని, బిల్లుల కోసం ఏ రాష్ట్రంలో లేనివిధంగా సర్పంచులు ఆత్మహత్యలు చేసుకోవడంతో పాటు ఆత్మహత్యాయత్నాలు చేసుకున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్యను తీర్చలేదని, ఒక పద్ధతి అంటూ లేకుండా ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని దుయ్యబట్టారు. కేటీఆర్ పొగడ్తలకు సర్పంచులు ఎవరూ మురిసిపోరని ఆయన పేర్కొన్నారు.

విలన్లకు లెనిన్, మార్క్స్ పేర్లను తీసివేయాలి

కళ్యాణ్‌నగర్, జనవరి 17: గుంటూరు కారం సినిమాలో విలన్లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు, వెంటనే వాటిని తొలగించాలని ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్(ఇప్టా) జాతీయ కౌన్సిల్ సభ్యులు కే స్వామి, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సినిమా పరిశ్రమలో మంది ఎక్కువైతే మతిలేని కథలు రాయడం, డ్రగ్స్‌కు బానిసలైన నిర్మాతలు చిత్రీకరించడం, అజ్ఞానంతో మాటలు రాయడం దుష్పరిణామాలకు దారి తీస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాత, దర్శకులకు మార్క్స్, లెనిన్‌లు మహానుభావులుగా కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వెంటనే వారి పేర్లను తొలగించాలని లేకపోతే థియేటర్ల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా అప్పాల రాజేందర్

అంతర్గాం, జనవరి 17: మండల పరిధిలోని ముర్మూర్‌కు చెందిన అప్పాల రాజేందర్ కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, మండల కోఆర్డినేటర్ గాదె సుధాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

పెద్దపల్లి రూరల్, జనవరి17: మండలంలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని పెద్దపల్లి ఎంపీడీవో రాజు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాజు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

-శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు



విజేత జట్టుకు కప్ అందజేస్తున్న శ్రీనుబాబు

మంథని, జనవరి 17: గెలుపు ఓటములతో సంబంధం లేకుండా యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు సూచించారు. స్థానిక క్రీడా మైదానంలో సంక్రాంతి సెలవులను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన శ్రీపాద కప్ క్రికెట్ పోటీ ముంగిపులో వేడుకలో విజేత వెంకి జట్టుకు రూ. లక్ష నగదు బహుమతితోపాటు ట్రోఫీని, రన్నరప్ చకిదే జట్టుకు రూ. 50 వేల నగదు తోపాటు కప్‌ను శ్రీనుబాబు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శశిభూషన్ కాచే, వొడ్నాల శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, గోటికార్ కిషన్‌జీ, పెంద్రు రమాదేవీ-సురేష్‌రెడ్డి, ఐలి ప్రసాద్, పోలు శివ, హనుమంతు, నూకల బానయ్య, కుడుదుల వెంకన్న, పేరవేన లింగయ్య యాదవ్‌లు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సంతాపం

కోల్‌సిటీ, జనవరి 17: గోదావరిఖని అడ్డగుంటపల్లిలో ఇద్దరు కూలీలు బుధవారం మృతిచెందడంపై రామగుండం శాసనసభ్యుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సంతాపం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరుపుతారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు.